క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జాకీర్ హుసేన్ ప్రకటనలో తెలిపారు. ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డిపో పరిధిలోని ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, సలహాలు, సూచనలు 9959226269 నంబర్‌కు తెలుపాలని కోరారు.

మెదక్‌కు ప్రత్యేక బస్సులు

క్రిస్మస్ పండగ పురస్కరించుకుని మెదక్ చర్చికి ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జాకీర్ హుసేన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జహీరాబాద్ డిపో నుంచి ఈ నెల 28 తేదీ వరకు బస్సులు నడుస్తాయని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట


మాట్లాడుతున్న పట్టణ సీఐ రమేష్

సంగారెడ్డి క్రైమ్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించడమే పోలీసుల ముఖ్య ఉద్దేశమని పట్టణ సీఐ రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డులు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పట్టణంలో రానున్న వరుస సెలవులు, పండగల నేపథ్యంలో అర్ధరాత్రి 12 లోపు పట్టణంలోని అన్ని రెస్టారెంట్లు, హోటలు, దుకాణాలు మూసి వేయాలని యజమానులకు తెలియజేస్తున్నామని చెప్పారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పట్టణంలో పలు కాలనీల్లో నిఘా పెంచామని తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన


టాలెంట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా వెలాసిటి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. పట్టణంలోని బ్లాక్ రోడ్డులోని ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్టులో పలు పాఠశాలలకు చెందిన 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు రమేష్ పేర్కొన్నారు. అంతకు మందు శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గురుకులంలో గణిత దినోత్సవం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గురుకుల గణిత ఉపాధ్యాయులు నర్సుగౌండ, పండరి, నారాయణ, మల్లేశం రానుజన్ సేవలను వివరించారు. విజయ్‌కుమార్ వేదిక్‌మ్యాథ్స్ గొప్పతనం, మాజిక్స్ విద్యార్థులకు చూపించారు. ప్రిన్సిపాల్ లింగారెడ్డి వారిని శాలువాలతో సన్మానించారు.

అధికారికంగా వెంకటస్వామి వర్ధంతి


వర్ధంతిని నిర్వహిస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ స్టేడియం, కలెక్టరేట్ కార్యాలయంలో వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి కలెక్టరేట్ సూపరింటెండెంట్ భానుప్రకాశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జ యంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని తెలిపారు.

ఆలు సాగుతో రైతులకు మేలు

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి




హుగ్గెల్లి వద్ద ఆలు పంటను పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: ప్రధాన కూరగాయల్లో ఆలుగడ్డ ఒకటి. మిగతా కూరగాయలతో పొల్చితే ఆలుకు కచ్చితమైన ధర ఉండడంతో నష్టం రాదు. జిల్లాలో ఆలుగడ్డ సాగు తక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది.. అయితే నియోజకవర్గంలో మాత్రం అధికంగా పండిస్తుంటారు. జహీరాబాద్ ప్రాంతంతో సాగుకు మంచి అవకాశాలు ఉన్నాయి. భూమిలో తేమ తక్కువగా ఉండి చలి ఎక్కువగా ఉండడంతో మంచి దిగుబడి వస్తుంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు సాగు చేస్తుండగా ఫిబ్రవరి నెలాఖరు వరకు దిగుబడి వస్తుంది. ఆలుగడ్డ సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. ఆలుగడ్డ ఎకరానికి రూ. 40 వేల వరకు ఖర్చవుతుందని, మొక్కనాటిన 85 నుంచి 90 రోజుల్లో పంట చేతికి వస్తుందన్నారు. ప్రస్తుతం పంటసాగు ఆశాజనకంగా ఉందన్నారు. ఆలుకు రసం పీల్చే పురుగు, దుంపతొలుచు పురుగు, ఆకుమాడు తెగులు, బ్యాక్టీరియా కుళ్లు తెగులు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. తెగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతుల గురించి ఆయన వివరించారు. మట్టి ఎగదోసే పద్ధతి(ఎర్తింగ్ అప్) వల్ల దుంపను సూర్యరశ్మి నుంచి రక్షణ లభిస్తుందన్నారు. గాలి, నీటి ప్రసరణ సక్రమంగా అంది దుంప బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. దుంప తొలుచు పురుగు వల్ల పంటకు ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. రైతులు పండిస్తున్న ఆలు పంటకు పచ్చదోమ, తెల్లదోమ ఆశించిందని, నివారణకు ఫ్లోనికామిడ్స్ 0.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కలు ఎండిపోవడం మొదలై పరిపత్వత సంకేతాలను చూపినప్పుడు హార్వెస్టింగ్ చేయాలన్నారు. ఈ సమయంలో భూమిలో నుంచి దుంపలు తీయవచ్చని చెప్పారు. దుంపలు తీయడానికి వారం పదిహేను రోజుల ముందు నీటి తడులు ఆపాలన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున్ స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. బోనాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంజీ. రాములు, నర్సింహ్మారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు


నిందితులతో పోలీసులు

ఝరాసంగం(జహీరాబాద్): పేకాట ఆడుతున్న పలువురుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ వెల్లడించారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులో ఐదుగురు పేకాట ఆడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం ఎస్‌ఐ, ఇతర పోలీసులు దాడులు నిర్వహించి వారి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3170 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ముత్యాలు, వంశీకృష్ణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉచిత సేవలతో లబ్ధి

జిన్నారం (పటాన్‌చెరు): కాజిపల్లి గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన సిటిజన్ ఆన్‌లైన్ సేవలను ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండి రమాకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, కార్మికులు, పెద్ద ఎత్తున ఆన్‌లైన్ సేవలను ఉచితంగా వినియోగించుకున్నారు. దాదాపు 182 మంది సేవలు పొందారని దండే రమాకాంత్ పేర్కొన్నారు. నేడు కూడా సిటిజన్ ఆన్‌లైన్ సేవలను అందించనున్నట్లు వీటిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

జహీరాబాద్ టౌన్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ బస్టాండ్ వరకు కొనసాగింది. అనంతరం పోలీసు స్టేషన్‌లో అమిషాపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ మాట్లాడుతూ.. దేశ రాజ్యాంగాన్ని రాసిన వ్యక్తిని అమిత్‌షా చులకనగా మాట్లాడడం శోచనీయమన్నారు. బడుగు బలహీన వర్గాలకు దేశంపై హక్కు కల్పించి ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తిని కొనియాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాజనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, సమతా సైనిక్‌దళ్, బుద్దిస్టు సొసైటీ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్!


నడిరోడ్డుపై ఇరుపక్కల నిలిపిన ఆటోలు

నారాయణఖేడ్: పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లోని కంగ్టి రూట్‌లో ఆటోలను నడిరోడ్డుపై అడ్డదిడ్డంగా ఆపుతున్నారు. దీంతో వాహనచోదకులు, కాలినడకన వెళ్లేవారు, బస్సు కోసం వేచి చేసే జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఆటోలు డివైడర్ పూర్తయ్యాక నెహ్రూనగర్ సమీపంలో నిలిపేవారు. ప్రస్తుతం నడిరోడ్డుపై, రోడ్డుకు ఇరువైపులా నిలపడం కారణంగా ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. పోలీసులు స్పందించి నడిరోడ్డుపై ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

25న అష్టాదశ కలశాల పడిపూజ

నారాయణఖేడ్: ఖేడ్ సమీపంలోని దోరువు లొంక హనుమాన్ ఆలయం ఆవరణలో ఈనెల 25న అయ్యప్ప అష్టాదశ కలశాల మహాపడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు హనుమాన్ అయ్యప్పసన్నిధానం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుస్వాములు, భక్తులు సమస్త భక్తజనులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొంది మహాప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా జనార్దన్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పద్మశాలి సంఘం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఆదివారం పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేకల జనార్దన్, ఉపాధ్యక్షుడిగా మధునాల నర్సింలు, ఆటిపాముల కృష్ణ, చిలివెరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఎన్నం మల్లేశం, గౌరవ అధ్యక్షుడిగా అంబటి విశ్వనాథం, చింతా అనంద్‌కుమార్, చిలివెరి రవికుమార్, కోశాధికారిగా చింతా చంద్రశేఖర్, అర్గనైజింగ్ కార్యదర్శిగా కోట రవీందర్, సహాయ కార్యదర్శులుగా రుమాండ్ల రాజు, గంజి వెంకటేశం, వెంకటాపురం నాగేష్, సహాయ కోశాధికారులుగా పుట్టవర్తిని బాలకృష్ణ, గాజుల శ్రీనివాస్, అమృతం స్వామి, సలహాదారులుగా చింతా గోపాల్, చీకుర్తి అంబయ్య, అడ్డగట్ల మనోహర్, కొంగరి ప్రభు, చింతాఅనంద్‌కుమార్, చిక్కుల మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా పద్మమాణిక్యం, బీమన్‌పల్లి నర్సింలు,ఫణికృష్ణ, గాజుల కృష్ణ,శ్రీనివాస్,చిలుకపల్లి రాములు, కలివెముల సుభాష్, వీరప్ప, సుధానంద్, అంబదాసు ఎన్నికయ్యారు.

మహా అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న స్వాములు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా డిసెంబర్ 25న స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వరన్ పిళ్లేస్వామి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు రైతు దినోత్సవం

సంగారెడ్డి టౌన్ : రైతు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య అధ్యక్షుడు తుమ్మల పృథ్వీరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పోతిరెడ్డిపల్లిలోని రైతు వేదికలో నేడు రైతు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు.


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు , అప్పటి ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పటాన్‌చెరు జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల 2003– 2004 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ... 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

జిల్లా కోర్టు ఆవరణలో బైక్ చోరీ

సంగారెడ్డి క్రైమ్ : జిల్లా కోర్టు ఆవరణలో గుర్తు తెలియని దుండగలు బైక్‌ను ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేష్ కథనం ప్రకారం.. కొండాపురం మండలం తొగర్‌పల్లికి చెందిన మహేందర్‌రావు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఈనెల 21 న ఉదయం పని నిమిత్తం జిల్లా కోర్టుకు వచ్చారు. పని ముగించుకొని తిరిగి వెళ్లేటప్పుడు పార్కింగ్ చేసిన బైక్ చుట్టూ పక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జాతరలతో ఆధ్యాత్మిక వాతావరణం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: జాతరల నిర్వహణతో పట్టణ, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంటుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలోని భ్రమరాంబ కేతకీ రేణుకా ఎల్లమ్మ సమేత మల్లికార్జున(బండల మల్లన్న) స్వామివారి ఆలయ జాతర మహోత్సవం జనవరి 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధించిన వాల్ పోస్టర్లను కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లేష్ యాదవ్, సభ్యులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న పాస్టర్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మహానయిమ్ మినిస్ట్రీస్ చర్చి నిర్వాహకులు యాదగిరి, నరేందర్‌ల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమానికి పాస్టర్ జోసెఫ్ కొమ్మినేని, మాజీ సర్పంచ్ యాదగిరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పాస్టర్ దైవ ప్రార్థనలు నిర్వహించి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జీవిత గాథను వివరిస్తూ చిన్నారులు నృత్యాలతో అద్భుతంగా అలరించారు. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా టపాసులు పేల్చి క్రైస్తవులు సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు నరేందర్ గౌడ్, ఇజ్రాయిల్, అమృతవల్లి, క్రైస్తవ ప్రతినిధులు, మహిళలు చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అనఘా దత్త వ్రత మహోత్సవం


మాట్లాడుతున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో నేడు (సోమవారం) 2,400 మంది మహిళలతో అనఘా దత్త వ్రత మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్రత కార్యక్రమాన్ని మొదటి సారిగా సంగారెడ్డిలోనే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్రతంలో పాల్గొనే మహిళలు ఉ. 8:30 గంటల వరకు ఆశ్రమానికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, కృష్ణమూర్తి, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సభ్యులు

పటాన్‌చెరు: సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివిధ మఠాల పీఠాధిపతులు పేర్కొన్నారు. అమీన్‌పూర్ పట్టణ పరిధి బీరంగుడలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభకు ఆదివారం 108 మంది పీఠాధిపతులు హాజరయ్యారు. సనాతన ధర్మ పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విదేశీ శక్తులు మన హిందూ–మతం మీద దాడి చేసే పరిస్థితులు ఉన్నాయి. కావున, కులాలకు అతీతంగా హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని పీఠాధిపతులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, బీజేపీ నాయకులు రవీందర్, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

గురుకులంలో రెండో రోజూ ఆందోళన

జోగిపేట(అందోల్): అందోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సద్గుణమేరీ గ్రేస్‌ను బదిలీ చేయాలంటూ రెండవ రోజూ (ఆదివారం) పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. శనివారం విద్యార్థులు చేపట్టిన ఆందోళనతో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీఓ పాండు, సీఐ అనిల్ కుమార్‌లు విచారణ చేపట్టారు. విద్యార్థుల ఆందోళన తీవ్రతరం కావడంతో తప్పకుండా ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం వరకు ప్రిన్సిపాల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు ఆగ్రహించారు. మరోసారి రోడ్డెక్కేందుకు విద్యార్థినులు గేట్ వద్దకు చేరుకునే సమయంలో సీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ పాండులు అడ్డుకున్నారు. వారందరిని పాఠశాల భవనం వద్దకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణగింది.

పార్ట్‌టైం లెక్చరర్‌పై కేసు

అందోల్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఆందోళన చేపట్టడానికి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులను పార్ట్‌టైం లెక్చరర్ సతీష్ కారణమని ఎస్‌ఐ పాండు తెలిపారు. ఆయనపై ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ గ్రేసి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

ప్రత్యేక తరగతులతో ప్రయోజనం

మునిపల్లి(అందోల్): పదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని ఎంఈఓ సూచించారు. ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు బోధించే ఆయా సబ్జెక్టులను శ్రద్ధగా వినాలని చెప్పారు. సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప స్వామిపూజ చేస్తున్న భక్తులు

సంగారెడ్డి జోన్: పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో వార్డు నంబర్ 35 సంజీవ్ హనుమాన్ ఆలయంలో పాండువర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ మహాపడిపూజ చేశారు. అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. భక్తిగీతాలతో అయ్యప్ప నామస్మరణ కాలనీ మోర్మోగింది. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్వాములు పండువర్మ గురుస్వామి, రాజు గురుస్వామి, పాండు గురుస్వామి, రాజు స్వామి, నారాయణరెడ్డి స్వామి శ్రీనుస్వామి, అమరేందర్‌స్వామి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మునిపల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో 10, 954 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ హరినందన్ రావు తెలిపారు. సర్వేను గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 2,891 మంది లబ్ధిదారులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.